# ప్రజా మంటలు

## తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

# టైమ్స్ వెస్ట్ హైదరాబాద్ ఎక్స్‌పో 2024ను ప్రారంభించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్ మే 25 (ప్రజామంటలు):** టైమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్-మియాపూర్ నరేన్ గార్డెన్స్ వేదికగా శనివారం ఏర్పాటు చేసిన 'టైమ్స్ వెస్ట్ హైదరాబాద్ ఎక్స్‌పోను' ను రాష్ట్ర నీటిపారుదల, ఆహారం - పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, టైమ్స్ ఆఫ్ ఇండియా ఆంధ్ర- తెలంగాణ రెస్పాన్స్ హెడ్ కమల్ కృష్ణన్ ప్రారంభించారు. ఈ వెస్ట్ హైదరాబాద్ ప్రాపర్టీ ఎక్స్‌పో మే 25 %ు% 26 తేదీల్లో నిర్వహించబడుతోంది. ఇందులో భాగంగా వెస్ట్ హైదరాబాద్ యొక్క విశిష్టమైన ప్రాపర్టీ నీ ప్రదర్శించడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఒక ప్రీమియర్ రియల్ ఎస్టేట్ ఎగ్జిబిషన్. వెస్ట్ హైదరాబాద్ రియల్ రంగంలోని వ్యూహాత్మక అంశాలతో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉండడంతో పాటు, వేగవంతమైన మౌలిక సదుపాయాల కారణంగా అనువైన నివాసానికి, వాణిజ్య రియల్ ఎస్టేట్ రంగంలో అభివృద్ధికి దారితీసింది. ముఖ్యంగా మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, పటాన్‌చెరు, మియాపూర్, బాచుపల్లి, కూకట్‌పల్లి వంటి ప్రాంతాలతో పాటు నగరంలోని ఇతర ప్రాంతాలకు అనుసంధానంగా ఉంటూ, పెట్టుబడిదారులకు మరియు ఇంటి యజమానులకు మంచి గమ్యస్థానంగా మారింది. ఈ టైమ్స్ వెస్ట్ హైదరాబాద్ ప్రాపర్టీ ఎక్స్‌పోలో రియల్ ఎస్టేట్ డెవలపర్‌లు, ఏజెంట్‌లకు తమ ప్రాజెక్ట్‌లను ప్రదర్శించడానికి మరియు ఔత్సాహికులకు ఒకచోట చేర్చి పరస్పరం చర్చించుకునేలా సమగ్ర వేదికను అందిస్తుంది. ఇందులో 20కు పైగా డెవలపర్‌ల నుండి 50 పైగా ప్రాజెక్ట్‌లతో పాటు వెస్ట్ హైదరాబాద్‌లో అందుబాటులో ఉన్న విభిన్న రకాల ప్రాపర్టీలను హైలైట్ చేస్తూ ఇక్కడి అనుకూలత, పెట్టుబడి అవకాశాలను కూడా నొక్కి చెబుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.., "ఈ టైమ్స్ వెస్ట్ ప్రాపర్టీ షో నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిల్డర్లు మంచి కస్టమర్లను ఆకర్షించాలని కోరుకుంటున్నాను. అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలతో విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది. ఈ రంగం అద్భుత ప్రతిభను ప్రదర్శిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం తరఫున భవనాలు, నిర్మాణ పరిశ్రమలకు మరియు రియల్ ఎస్టేట్ బూమ్‌కు అన్ని విధాలుగా సహాయం చేస్తాము అందిస్తామని హామీ ఇస్తున్నాను. అంతేకాకుండా అనేక ప్రపంచ నగరాల్లోని అధునాతన వాటర్‌ఫ్రంట్‌ల తరహాలో హైదరాబాద్లోని మూసీ నదికి మైలురాయిగా నిలుస్తుంది. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం 22,000 కోట్ల ప్రాంతీయ రింగ్ రోడ్‌ను కూడా ప్రకటించింది. ఇది అందుబాటులోకి రావడానికి మరియు రవాణా సులభతరం చేయడానికి సహాయపడుతుంది. నగరాన్ని మేటిగా నిలపడంలో భాగంగా గ్రీన్ హైదరాబాద్, కాలుష్య రహిత హైదరాబాద్, గ్రీన్ బిల్డింగ్‌లను ప్రోత్సహించడానికి, స్థిరమైన జీవనం కోసం అవసరమైన ప్రతి అంశానికి మద్దతును ఇస్తున్నాము. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులను నిరంతరం ఆకర్షిస్తున్నాము.. ఇందులో భాగంగానే కొన్ని సంవత్సరాలలో హైదరాబాద్‌ను భారతదేశంలోనే కాకుండా, ప్రపంచంలోని అత్యుత్తమ ప్రపంచ నగరాలతో పోటీపడేలా పెట్టుబడిదారులకు ఉత్తమ పెట్టుబడి గమ్యస్థానంగా మారుస్తామని ఆశిస్తున్నాము. ఈ ప్రాపర్టీ షో నిర్దిష్ట లక్ష్యాలను సాధిస్తుందని మరియు బిల్డర్లు మరియు కస్టమర్‌లు ఇద్దరూ సంతోషంగా ఉన్నారని నేను ఆశిస్తున్నాను" అని తెలిపారు.

ఎక్స్‌పో డెవలపర్‌ల ఆధ్వర్యంలోని ఆకట్టుకునే ప్రణాళికలు వినూత్నమైన ప్రాజెక్ట్‌లను కలిగి ఉంది. వీటితో పాటు విభిన్న అభిరుచులు, ప్రాధాన్యతలు, బడ్జెట్‌లను తీర్చడానికి వ్యూహాత్మక లక్షణాలను అందిస్తుంది. మొదటి రోజు హాజరైన వారికి విలాసవంతమైన విల్లాల మొదలు అపార్ట్‌మెంట్‌లు, ప్రశాంతమైన ప్లాట్‌ల వరకు వారి కలల గృహాలను కనుగొనే అవకాశం ఉంది.

## వేములవాడలో పూజారి మహేశ్ రెండు కోట్లతో పరారీ



**వేములవాడ మే 25 (ప్రజామంటలు):** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో అంబా భవాని ఆలయంలో కొంతకాలంగా పూజారిగా పనిచేస్తున్న మహేశ్ పూజలతో పాటు జ్యోతిష్యం, వశీకరణ పూజలు చేస్తూ ప్రజలకు దగ్గరయ్యాడు. దీంతో తన వద్ద డబ్బులు డిపాజిట్ చేస్తే అధిక వడ్డీ ఇస్తానంటూ పూజారి మహేశ్ నమ్మించాడు. డిపాజిట్ కాలం ముగిసిన తర్వాత డబ్బులు చెల్లించి, మళ్ళీ డిపాజిట్ల ఆశ చూపి పూజారి మహేశ్ దాదాపు రూ.2 కోట్ల వరకు డిపాజిట్లు సేకరించి ఉడాయించాడు. కొద్ది రోజులుగా జ్యోతిష్యాలయం మూసి ఉండటంతో పాటు ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు.



**జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామం లో కల్లెడ దేవయ్య ఇంట్లో చోరీ. ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో వున్న ఐదు తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదును ఎత్తుకెళ్లిన దొంగలు.**



**జగిత్యాల పట్టణం లోని మిషన్ కాంపౌండ్ కు చెందిన కొయ్యని రతన్ రాయల్ (50) అనే వ్యక్తి తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య. మృతుడు చనిపోవడానికి వైజాగ్ కు చెందిన కర్ర శ్రీనివాస మూర్తి కారణమని సూసైడ్ నోట్ రాసి జేబులో పెట్టుకున్నట్టు పోలీసులు గుర్తించారు.**

## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకుల అరెస్ట్

**రాయికల్ మే 25 (ప్రజామంటలు):**



గత మార్చి నెలలో 23న పట్టుకున్న గంజాయి ముఠాలో నలుగురిలో ఇద్దరు పరారీలో ఉండగా వారిని గుర్తించి పట్టుకుని వారి నుంచి 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న రాయికల్ పోలీసులు. అరెస్ట్ అయిన వారిలో కోరుట్ల పట్టణానికి చెందిన మానాల అక్షిత్, మల్లాపూర్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన మెండే నివేద్ ఉన్నారు. వారిని రిమాండుకు తరలించినట్లు జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ తెలిపారు.

## అక్రమ మట్టి తరలింపుపై పంచాయతీరాజ్ కమిషనర్ కి ఫిర్యాదు

**జమ్మికుంట మే 25 (ప్రజామంటలు):**



జమ్మికుంట మండలం మాసనపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో భాగంగా గ్రామంలోని ఊరుకుంట చెరువులో మట్టి త్రవ్వకాలు చేపట్టారు రైతులకు చెందాల్సినటువంటి మట్టిని గ్రామ మాజీ సర్పంచ్ కల్పనా తిరుపతిరెడ్డి, పోల్సాని రాజేశ్వరరావు, గ్రామ కార్యదర్శి శివరంజని, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ అనురాధ కలసి కుమ్మక్కై దాదాపు 150 ట్రిప్పుల మట్టిని జమ్మికుంట లోని ఇటుక బట్టీల యజమానికి అమ్ముకున్నారని గ్రామానికి చెందిన బండారి కుమార్, మాజీ ఉపసర్పంచ్ దొంతర వేణ రమేష్, స్థానిక జమ్మికుంట ఎంపీడీవో కు ఫిర్యాదు చేయగా ఎంపీడీవో భీమేష్ విచారణ చేపట్టి గ్రామ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాస్ నోటీసు ఇచ్చి తూ తు మంత్రంగా వదిలేసారని అసలు సూత్రధారుల పైన ఎటువంటి చర్యలు తీసుకోలేదని కోరుతూ శనివారం పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ శ్రీమతి అనిత రామచంద్రన్ గారికి ఫిర్యాదు చేశారు. తప్పకుండా మట్టి తరలింపులో సూత్రధారులైన వారి పైన చర్యలు తీసుకొని కేసు నమోదు చేసి రికవరీ చేయాలని తెలిపారు.

## పట్ట భద్రులతో సమావేశంలో ఎన్నికల ఇంచార్జి జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**జగిత్యాల జిల్లా ప్రతినిధి మే 25 (ప్రజామంటలు):**



వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగం గా తూర్పు వరం గల్ లోని ఖిలా వరంగల్ 35వ డివిజన్‌లో పద్మశాలి సేవా సంఘంలో ముఖ్య కార్యకర్తలు, పట్ట భద్రులతో సమావేశంలో ఎన్నికల ఇంచార్జి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పాల్గొన్నారు. వారికి దిశా నిర్దేశం చేసి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాకేష్ రెడ్డి కి మద్దతుగా ఓటు వేయాలని, ఇతర పట్ట భద్రులతో ఓటు వేయించి రాకేష్ రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో 35 డివిజన్ కార్పొరేటర్ ప్రవీణ్, ఇంచార్జి లు పాలేపు రాజేంద్ర ప్రసాద్, దావ సురేష్, నాయకులు నగేష్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మల్యాలలో ఘనంగా చిరుతల రామాయణం నాటక ప్రదర్శన



**మల్యాల మే 25 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో చిరుతల రామాయణము నాటక ప్రదర్శన ఘనంగా కొనసాగుతున్నది. బుధ, గురు, శుక్రవారాల లో మూడు రోజులపాటు జరిగే నాటక ప్రదర్శనలో దశరథ మహారాజు ప్రవేశం, లంకిని వద,సీతారాముల కల్యాణం, వనవాసము, వాలి వధ, రావణ వద, సీతారాముల పట్టాభిషేకము తదితర ఘట్టాలు ఈ నాటక ప్రదర్శనలు ప్రదర్శిస్తామని శిక్షకులు రాగుల రవీందర్ తెలిపారు. మల్యాల మండల కేంద్రంలోని భక్త మార్కండేయ కాళ బృందం సభ్యులు ప్రదర్శిస్తున్న ఈ నాటకానికి ప్రజల నుండి మంచి స్పందన వస్తున్నదని అయన అన్నారు. ఈ ప్రదర్శనలో మహ ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ కు చెందిన గోస్కుల రమేష్ బృందం అందిస్తుండగా,మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణానికి చెందిన కారంగుల సమ్మయ్య లైటింగ్, సౌండ్ ఏర్పాట్లు చేశారు. పాత్రధారులకు మేకప్ గోదావరిఖని కి చెందిన సంతోష్ కుమార్ బృందం, ధర్మారం మండలం కటికనపల్లికి చెందిన గోలాడ సత్యం కీ బోర్డు మ్యూజిక్ అందిస్తుండగా తబలా చెన్నూరు కు చెందిన రమేష్ చారీ అందిస్తున్నారని, ప్రముఖ యూ ట్యూబ్ ఛానల్ 69 నిర్వాహకులు మొగిలి కిరణ్ నాటక ప్రదర్శన ను చిత్రీకరిసున్నారని రాగుల రవీందర్ తెలిపారు.

## ఏకరూప దుస్తుల తయారీ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్





**జగిత్యాల టౌన్ మే 25 (ప్రజామంటలు):** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ స్కూల్ పిల్లలకు అందించే యూనిఫాంలను ఏక రూప దుస్తుల కుట్టు కేంద్రాల ద్వారా ఎస్.జి. హెచ్. మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రారంభించడం జరిగిందని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష అన్నారు. శనివారం రోజున విద్యానగర్, తీన్ ఖని చౌరస్తాలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏక రూప దుస్తుల కుట్టు కేంద్రాన్ని(స్కూల్ యనిఫాం కుట్టు మిషన్ కేంద్రాలను) జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భాగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ స్కూల్ పిల్లలకు అందించే యూనిఫాం లను కుట్టే బాధ్యతను ఈ సంవత్సరం మహిళా సంఘ సభ్యులకు అప్పగించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. స్కూల్ ప్రారంభించే సమయానికి ముందుగానే, యూనిఫాం లు అందించే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని, అవసరమైతే ఒక రోజులో రెండు షిఫ్ట్ లు పని జరిగేలా సభ్యులను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎస్. జి. హెచ్ మహిళలకు మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ ప్రభుత్వం ఏక రూప దుస్తుల కుట్టు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. గ్రామీణ మండలాల యూనిఫాంల సంఖ్య 1,20,822, పట్టణ పరిధిలో గల యూనిఫాంల సంఖ్య 40,941 అని మొత్తం జిల్లాలో మొత్తం యూనిఫాం ల సంఖ్య 1,61,763 అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సంపత్ రావు, మెప్మా ఏ.ఓ. శ్రీనివాస్, డి.యం. సి. సునీత, టి.యం.సి. రజిత, సి.ఓ. రాధ, మహిళా సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రైన్ వర్క్ రద్దు పరిచి తిరిగి టెండర్ పిలవాలి

### కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ



**జగిత్యాల మే 25 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా 35వ వార్డులో తహసీల్ చౌరస్తా నుండి టవర్ వెళ్ళే రోడ్డులో గత 45 సం క్రితం కట్టిన డ్రైన్ పూర్తిగా పంది కొక్కులు తోడిన మట్టితో పూరుకు పోయి డ్రైన్ వాటర్ మొత్తం రోడ్డు పైకి రావటం వల్ల డ్రైన్ వర్క్ పెట్టాలని కమీషనర్, చైర్మన్ దృష్టికి తీసుకు వెళ్ళిన డ్రైన్ వర్క్ పెట్టక పోవడం వల్ల అక్కడ దుకాణాదారుల ఇబ్బందుల వల్ల కచ్చానాళా తీయడం జరిగింది. ఈ కచ్చా నాళా తేది.15-12-2022 రోజున తీయగా అప్పుడున్న కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళగా, కౌన్సిల్ దృష్టికి తీసుకు వెళ్ళగా 9-6-2023 లో రోజున టెండర్ అయ్యింది. సంబందిత కాంట్రాక్టర్ 26-6-2023 రోజున వర్క్ అగ్రిమెంట్ చేసుకోగా 1-3-2024 రోజున మార్కింగ్ ఇచ్చిన ఇప్పటి వరకు పని చేయక పోవడం వల్ల ప్రజలు మరియు అక్కడ ఉన్న దుకాణా దారులు చాలా ఇబ్బందికి గురవుతున్న దృష్ట్యా పలుమార్లు %ణ.జు%. గారి దృష్టికి వెళ్ళిన ఫలితం శూన్యం సంబంధిత కాంట్రాక్టర్ నా ఇష్టం వచ్చినట్లు మార్కింగ్ చేస్తా నా ఇష్టమైనప్పుడు డ్రైన్ కడతానని అక్కడున్న ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తూ ఇబ్బంది పెడుతున్నారు. వర్క్ అగ్రిమెంట్ చేసుకొని దాదాపు 11 నెలలు అవుతుంది. వర్క్ కు మార్కింగ్ ఇచ్చి, కూడ 3 నెలలు గడుస్తున్న పని చేయటం లేదు కావున వెనువెంటనే ఆ పనిని రద్దు పరిచి సంబందిత కాంట్రాక్టర్ ను బ్లాక్ లిస్టో పెట్టి తిరిగి టెండర్ పిలిచి వెంటనే పని అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని మనవి . అదే రోడ్డులో మిషన్ భగీరథ వారు పైప్ లైను వేసి దాదాపు 3 సం. అవుతున్నా కనెక్షన్లు ఇవ్వకుండా, ప్యాచులు చేయక పోవడం వల్ల చాల ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. వెను వెంటనే పనులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని మా ప్రజల పక్షాన జగిత్యాల మున్సిపల్ 35 వ వార్డు కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ మనవి చేశారు.

## పాపయ్యపల్లిలో ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

### పాల్గొన్న హనుమాన్ మాలాధారణ స్వాములు



**జమ్మికుంట మే 25 (ప్రజామంటలు) :** జమ్మికుంట మండలంలోని పాపయ్యపల్లి గ్రామంలో శనివారం ఘనంగా హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా మండలం అర్ధమండలం హనుమాన్ మాల ధరించి నిష్ఠ నియమాలతో స్వామివారికి పూజిస్తారు స్వాములు.హనుమాన్ జయంతి సందర్భంగా గ్రామంలో హనుమాన్ ఉత్సవ విగ్రహాన్ని రతంలో ఆసీనులై గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగింపు శోభాయాత్ర నిర్వహించారు. శ్రీరామ జయరామ జయజయ రామ అంటూ రామనామ స్మరణ చేసుకుంటూ డీజే పాటలు మేల తాళాల మధ్య స్వాములు నృత్యాలు చేస్తూ భక్తులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు గుండెకారి మధు, శంకర్, శ్రీనివాస్, హరీష్, శివ, వీరేశం, సురేష్, నరేశ్ తో పాటు హనుమాన్ మాలాధారణ స్వాములు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బీడీ కార్మికుల వేతనాలు పెరుగుదల



**హైదరాబాదు మే 25 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్రంలోని ఏడు లక్షల మంది కార్మికులకు వేతనాల కోసం కార్మికుల విషయంలో అన్ని కార్మిక సంఘాలు నోటీసులుఇవ్వడం జరిగింది తదుపరి ఈరోజు హైదరాబాదులో బీడీ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ బీడీ కార్మిక సంఘాలు జరిపిన చర్చల్లో భాగంగా బీడీలు చుట్టే కార్మికులకునాలుగు 4:25 పైసలు మరియు నెలవారి ఉద్యోగులకు 1700 రూపాయలు మరియు ప్యాకింగ్ కార్మికు లకు 3650 పెంచడానికి యజమానులు అంగీకరించడం జరిగింది చర్చల్లో భారతీయ మజ్దూర్ సంఘ రాష్ట్ర అధ్యక్షులు కలాల్ శ్రీనివాస్, తెలంగాణ స్టేట్ బీడీ కార్మిక సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. సుధీర్ కుమార్ (బి.ఎం.ఎస్) బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి కొండల్ రెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా సంచిన వార్షికోత్సవాలు

**నిజామాబాద్,మే25:** పెద్దకొడప్గల్ మండలంలోని బేగంపూరండాలో గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీ జై భవాని మాతా, శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ సంచిన వార్షికోత్సవాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి ఆలయ ప్రదక్షణలు చేస్తూ.. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సంవత్సరం వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండి ప్రజలకు, జీవరాసులకు ఇబ్బందులు కలగకుండా దేశ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.

# స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**జమ్మికుంట మే 25 (ప్రజామంటలు):**
ఇటీవల జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఇందిరానగర్ కు చెందిన సీర్ల దేవేందర్ హార్ట్ ఎటాక్ తో చనిపోగా అతని కుటుంబానికి తన 10వ తరగతి మిత్రులు శనివారం 33,500 రూపాయలను చిన్నపిల్లలకు సంరక్షణగా వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు గోపు తిరుపతి, మొలుగూరి సదయ్య, పొన్నగంటి సంపత్, సమ్మెట రమేష్, ఎగ్గేటి కుమారస్వామి, ఆళ్ళ మాధవరెడ్డి, సంధ మహేందర్, మచ్చగిరి సుదర్శన్, వడిజ సాగర్, బిసాడి రాజు, కడెం సంపత్, రహీమ్, పెండెం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# పలువురు కాంగ్రెస్ నాయకులను పార్టీ నుండి బహిష్కరణ

## తుమ్మేటి సమ్మిరెడ్డికి షోకాజ్ నోటీస్



**జమ్మికుంట మే 25 (ప్రజామంటలు):**
హుజురాబాద్ నియోజకవర్గం జమ్మికుంట పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కసుబోజుల వెంకన్న, ఒళ్ళాల శ్రీనివాస్, ఎండి. సలీం, ఎండి. ఇమ్రాన్, ఎండి సలీం పాషా, వాసాల రామస్వామి లను పార్టీ నుండి బహిష్కరించడంతోపాటు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తుమ్మేటి సమ్మి రెడ్డి గారికి షోకాజ్ నోటీస్ అందజేయడం జరుగుతుంది. హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితెల ప్రణవ్ బాబు గారిపై ఉద్దేశపూర్వకంగా చేసిన విమర్శలు, కక్షపూరితంగా చేసిన అసందర్భ ఆరోపణలపై స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ద్వారా అందిన ఫిర్యాదుల మేరకు మరియు అంతర్గతంగా చర్చించుకోవలసిన పార్టీ విషయాలను బహిరంగంగా పత్రికా విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టకు భంగం కలిగేలా ప్రవర్తించిన కాంగ్రెస్ నాయకులు కసుబోజుల వెంకన్న, ఒల్లాల శ్రీనివాస్, ఎండి. సలీం, ఎండి. ఇమ్రాన్, ఎండి సలీం పాషా, వాసాల రామస్వామి పై ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అలాగే వీరిలో కొంతమంది పలుమార్లు కాంగ్రెస్ పార్టీ నుండి ఇతర పార్టీలోకి వలస వెళ్లడం తిరిగి రావడం బిజెపి, బి.ఆర్.ఎస్ పార్టీలకు మరియు ఆ పార్టీలకు చెందిన వ్యక్తులకు అనుకూలంగా వ్యవహరించడం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకత్వంపై సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేయడాన్ని జిల్లా కాంగ్రెస్ తీవ్రంగా పరిగణించింది. నియోజకవర్గంలో ఇటీవల జరిగిన రెండు ఎన్నికల్లో సీనియర్ కాంగ్రెస్ నాయకుల నాయకత్వంలో కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయడం కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన హామీలపై ప్రజలు సంపూర్ణ విశ్వాసం ఉంచి ఓటు వేసినప్పటికీ ఇదంతా తమ ద్వారానే జరిగిందని కేవలం తాము కష్టపడడం వల్లనే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓట్లు వచ్చాయి తప్ప కాంగ్రెస్ పార్టీ కానీ పార్టీ అగ్ర నాయకుల ప్రభావం ఏమీ లేదని గత నాలుగైదు మాసాల కింద కాంగ్రెస్ పార్టీలో చేరిన పార్టీ సిద్ధాంతాలు తెలియని వ్యక్తులు నియోజకవర్గానికి సంబంధంలేని నాయకుల ప్రమేయంతో పత్రిక విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో అయోమయం కలిగే విధంగా ప్రవర్తించడాన్ని, కార్యక్రమాలు చేపట్టడాన్ని, వ్యవహరించడాన్ని జిల్లా కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తుంది.కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వీరిపై పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జి చెన్నారెడ్డి గారి దృష్టికి తీసుకువెళ్లడంతోపాటు వారి ఆదేశానుసారం ఈ విధమైన చర్యలకు ఇక ముందు ఎవరూ సాహసించకుండా చేపట్టే కార్యాచరణలో భాగంగా పైన తెలుపబడిన నాయకులను కాంగ్రెస్ పార్టీ నుండి బహిష్కరిస్తున్నట్లు పత్రిక ముఖంగా తెలియజేస్తున్నాం. ఈ క్షణం నుండి వీరికి కాంగ్రెస్ పార్టీ తో గాని, కాంగ్రెస్ పార్టీకి వీరితో గాని ఎలాంటి సంబంధాలు లేవనే విషయాన్ని స్థానిక నాయకులు, మరియు మీడియా మిత్రులు గుర్తించాలని తెలియజేస్తున్నాము. అలాగే సీనియర్ కాంగ్రెస్ నాయకుడుందని తనకు తానే ప్రచారం చేసుకుంటున్న జమ్మికుంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి వ్యవహరించిన తీరును పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు వారిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు వారికి కాంగ్రెస్ పార్టీ పక్షాన షోకాజ్ నోటీసు అందజేస్తూ వారికి ఈ నోటీసు అందిన నాటి నుండి వారం రోజుల లోపల వారిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని తెలియజేస్తున్నాం.

# రాకేష్ రెడ్డిని ఆశీర్వదించండి

## టీజీప రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవ రెడ్డి



**హనుమకొండ / వరంగల్ మే 26 (ప్రజామంటలు):**
పట్టభద్రులంతా ఐక్యంగా ఉండి, మన వరంగల్ ముద్దుబిడ్డ , ఉన్నత విద్యావంతుడు, మేధావి, సేవా తత్వరుడు అయినా ఏనుగుల రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవ రెడ్డి పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్ ఆదేశానుసారం గత పది రోజుల నుండి తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ మూడు టీములు రాకేష్ రెడ్డి గెలుపు కోసం ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో కరపత్రాలు పంచుతూ మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారన్నారు. రాకేష్ రెడ్డి మంచి మెజారిటీతో గెలుస్తాడని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, రవీందర్ రెడ్డి, శివ,రాకేష్,విజయ్, సతీష్, ప్రేమ్ సాగర్ రావు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయం

**గొల్లపల్లి మే 25 (ప్రజామంటలు):**
గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రోత్సహించి, వారిలో దాగివున్న ప్రతిభను గుర్తించి, సామాగ్రి అందజేసి, బిబి కే క్రికెట్ టోర్నమెంట్ పేరిట క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించి క్రీడాకారులకు ట్రోఫీలను అందజేయడం పాత్రికేయుడైన బొమ్మెన కుమార్ అభినందనీయమని ప్రభుత్వ విప్ అట్లూరి లక్ష్మణ్ కుమార్ సతీమణి కాంత కుమారి అన్నారు. మండలంలోని భీంరాజ్ పల్లి గ్రామంలో గత ఐదు రోజులుగా నిర్వహించినటువంటి భీమ్ రాజ్ పల్లి బొమ్మెన కుమార్ (బిబికె) క్రికెట్, వాలీబాల్, మహిళలకు కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించగా శ్రీమతి కాంత కుమారి చేతుల మీదుగా దమ్మన్నపేట, లక్ష్మీపూర్, భీమ్ రాజు పల్లి విజేతలకు ట్రోపీలను అందజేశారు. ఎస్ ఎస్ సి లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత ఆటపాట్లకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాత్రికేయ వృత్తిలో ఉంటూ మరోవైపు క్రీడాకారులను ప్రోత్సహించి, గెలుపొందిన విజేతలకు నా చేతుల మీదుగా బహుమతులు ప్రధాన చేయడం సంతోషమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత ఆట పాటలతో రాష్ట్ర, జాతీయ క్రీడా పోటీల్లో రాణించి, గ్రామానికి, జిల్లాకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. బార్ అసోసియేషన్ మాజీ జిల్లా అధ్యక్షులు తాండ్ర సురేందర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని మధ్య తరగతి కుటుంబంలో జన్మించి పాత్రికేయుడిగా మంచి పేరు సంపాదించుకొని క్రీడాకారులను ప్రోత్సహిస్తూ బహుమతులను ప్రధానం చేయడం అభినందించదగ్గ విషయం అన్నారు. అనంతరం బిబికే టోర్నమెంట్ స్పాన్సర్ బొమ్మన కుమార్ కు క్రీడాకారులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీమతి కాంత కుమారు ని టోర్నమెంట్ స్పాన్సర్ బొమ్మన కుమార్ ఘనంగా సన్మానించగా, మహిళలు పూల వర్షం కురిపించారు. లీడ్ ఇండియా రాష్ట్ర శిక్షణ సమన్వయ కర్త తాదురి శ్రీనివాస్ ఆచార్య, గొల్లపల్లి మండల లీడ్ ఇండియా సమన్వయ కర్త జక్కుల తిరుపతి రావు బిబికే కార్యక్రమ సమన్వయకర్త గా వ్యవహించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ జిల్లా అధ్యక్షులు తాండ్ర సురేందర్, మాజీ సర్పంచ్ రేవల్ల సుజాత లింగయ్య, పురం శెట్టి వెంకటేశం, తాదూరి సత్యానారాయణ, కిష్టంపేట రమేష్ రెడ్డి, పల్లెర్ల వీరేశం,కంది స్వామి, బొమ్మన నరేందర్, డీలర్ రాజు రెడ్డి, చిర్ర దిలీప్,తడగొండ విజయ్, బొమ్మన వెంకటేశం, సింగారపు లచ్చయ్య, మహేష్, ఆర్ఆర్ డిజిటల్ రమేష్, సామల ప్రసాద్, చింతల రవీందర్, గడప రవి, గౌతమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.






జగిత్యాల జిల్లా గొల్లపల్లి లో బిబికే క్రికెట్ టోర్నమెంట్ లో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న ప్రభుత్వ విప్పు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సతీమణి కాంతా కుమారి, స్పాన్సర్ బొమ్మెన కుమార్.

# జగిత్యాల జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు 2వ రోజు ప్రశాంతం



**జగిత్యాల మే 25 (ప్రజామంటలు):**
శనివారం 19 పరీక్ష కేంద్రాల్లో జరిగిన ప్రథమ భాష ప్రథమ సంవత్సరము ఇంగ్లీష్ పరీక్షలో 950 మంది విద్యార్థులకు గాను 899 మంది విద్యార్థులు హాజరైనారు. 51 మంది విద్యార్థులు గైర్ హాజర్ అయినారు. మధ్యాహ్నం జరిగిన రెండవ సంవత్సరము ప్రథమ భాష ఆంగ్ల పరీక్షలో 348 మంది విద్యార్థులకు గాను 320 మంది విద్యార్థులు హాజరైనారు. 28 మంది విద్యార్థులు గైర్ హాజర్ అయినారని పరీక్షల కన్వీనర్ బి. నారాయణ తెలియజేశారు.

# టెన్త్‌లో రాణించిన స్టూడెంట్స్‌కు సన్మానం




**సికింద్రాబాద్ మే 25 (ప్రజామంటలు):**
బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం లో 2023-24 అకాడమీ ఇయర్ లో పదవ తరగతి లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు షెడ్యూల్ కులాల రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ లోని లోయర్ ట్యాంక్ బండ్ వద్ద నున్న డా.అంబేద్కర్ భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో టెన్త్ లో చక్కటి మార్కులు సాధించిన స్టూడెంట్స్ కు ఏఐఎస్సీఆర్పీఎస్ జాతీయ అధ్యక్షులు రాగాల నాగేశ్వర్ రావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డి.సుదర్శన్ బాబు లు సన్మానించారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్కూల్ లల్లో సీటును ఉచితంగా ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం కింద తాము సిటీలోని ఆయా కార్పొరేట్ స్కూల్ చేర్పించిన మొదటి బ్యాచ్ కింద 2014 లో మొదటి తరగతిలో చేర్పించిన విద్యార్థులు ఈ ఏడాది టెన్త్ క్లాస్ కు చేరుకొని, ఇలా చక్కటి మార్కులు సాధించి, అందరికి ఆదర్శంగా నిలవడం అభినందనీయని రాగాల నాగేశ్వర్ రావు, డి.సుదర్శన్ బాబు లు అన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర సలహాదారులు రాయల నరసింహారావు, జిల్లా అద్యక్షులు గుంటి విజయబాబు, సిటీ ఉపాధ్యక్షులు, బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం కో ఆర్డినేటర్ కురుమ మహేందర్, రంగారెడ్డి జిల్లా అద్యక్షులు గంగం శివశంకర్, డి.శంకర్, బట్టు కృష్ణ, ఆలేటి బాలమణి, కత్తి ప్రవీణ, రాపాక అశోక్, నాగేశ్, పత్తి మల్లేశ్, దేశపాక గోవర్ధన్, స్టూడెంట్స్ పేరేంట్స్ పాల్గొన్నారు.

# డాక్టర్ చేతివాటంపై గాంధీలో కలకలం

**- రూ.10 వేలు ఇచ్చినట్లుగా పేషెంట్ ఆరోపణ - విచారణ కమిటీ వేసిన సూపరింటెండెంట్**




**సికింద్రాబాద్ మే 25 (ప్రజామంటలు):**
పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా వైద్యం అందించే గాంధీ ఆసుపత్రిలో సర్జరీ చేయడానికి ఓ డాక్టర్ పేషెంట్ ను డబ్బులను డిమాండ్ చేసిన ఉదంతం కలకలం రేపుతోంది. వివరాలు ఇవి. ఖమ్మం జిల్లా మధిర కు చెందిన వెంకట్ రెడ్డి ఆర్థో అనారోగ్య సమస్యలపై గాంధీ ఆసుపత్రిలో చేరగా, సర్జరీ అవసరమని డాక్టర్లు తేల్చారు. అయితే సర్జరీ చేయడానికి ఆర్థోపెడిక్ డిపార్ట్ మెంట్ కు చెందిన వైద్యాధికారి రూ. 10 వేలు డిమాండ్ చేశారని, విధిలేక సదరు డబ్బులను గూగుల్ పే ద్వారా చెల్లించినట్లు పేషెంట్ భార్య గోవిందమ్మ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొ.రాజారావు కు లేఖ రూపంలో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం సర్జరీ పూర్తి చేసుకున్న పేషెంట్ డిశ్చార్జీ అయి కుటుంబసభ్యులతో కలసి ఇంటికి వెళ్ళిపోయారు. అయితే తనపై పేషెంట్ చేసిన ఆరోపణలు నిరాధారమని, ఎవరికో గూగుల్ పే ద్వారా డబ్బులు పంపిస్తే, అవి తాను తీసుకున్నట్లు ఎలా అవుతుందంటూ పేషెంట్ ఆరోపణలను సదరు డాక్టర్ ఖండించినట్లు తెలిసింది.

**విచారణ కమిటీ వేశాం**

**పొ. రాజారావు, గాంధీ సూపరింటెండెంట్**

ఆర్థోపెడిక్ డిపార్ట్ మెంట్ హెచ్వోడీ డా. వాల్యా పై ఓ పేషెంట్ చేసిన ఆరోపణలపై నిజా, నిజాలు నిగ్గ తేల్చేందుకు గాను నలుగురు హెచ్వోడీలతో కూడిన విచారణ కమిటీని వేశాం. పేషెంట్ ఆరోపణల అంశాన్ని డీఎంఈ దృష్టికి తీసుకువెళ్ళడం జరిగింది. విచారణ కమిటీ నివేదిక వచ్చిన తర్వాత దానిని కూడ వైద్య శాఖ ఉన్నతాధికారులకు పంపిస్తాం.

# రైలుకింద పడి ప్రేమజంట ఆత్మహత్య

**వరంగల్,మే25:** వరంగల్ రైల్వే స్టేషన్ కు సమీపంలో ఓ ప్రేమజంట రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా సారధి నగర్ కు చెందిన ఐలపోగు సుష్మా (17) అనే యువతి, వరంగల్ కాశిబుగ్గ కు చెందిన చెన్నకేశవ అనే యువకుడు గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఏడు మోరీల వద్ద నవజీవన్ ఎక్స్ ప్రెస్ కిందపడి సుష్మా, చెన్నకేశవ ఆత్మహత్యకు పాల్పడ్డారు. యువతి ఘటనా స్థలంలోనే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన యువకుడిని ఎంజిఎం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అతడు కూడా చనిపోయినట్టు సమాచారం. రెండు మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం ఎంజిఎం ఆస్పత్రికి తరలించారు. సుష్మా కనిపించడంలేదని ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో మిస్సింగ్ కేసు నమోదు అయింది. బంధువులకు పోలీసులు సమాచారం అందించారు. మృతుల కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత ఏ కారణంగా ఆత్మహత్యకు చేసుకున్నరనే విషయాలు బయటకు వస్తాయన్నారు. ఐఒఎం.మల్లయ్య, ఎస్ఐ, ఆర్పీ, వరంగల్ రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రేమ వ్యవహారానికి పెద్దలు అడ్డుచెప్పడంతోనే ఆత్మహత్య చేసుకుని ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

# ఆరో విడతలో చెదురుముదురు ఘటనలు

## 57.70 శాతం పోలింగ్ నమోదైనట్లు ఈసీ వెల్లడి

**న్యూఢిల్లీ,మే25:** లోక్‌సభ ఎన్నికల పక్రియలో భాగంగా శనివారం ఉదయం మందకొడిగా మొదలైన 6వ విడత పోలింగ్ చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకూ 57.70 శాతం పోలింగ్ నమోదైనట్లు ఈసీ తెలిపింది. పశ్చిమబెంగాల్లో అత్యధికంగా 77.99 శాతం పోలింగ్ నమోదు కాగా, జమ్మూకశ్మీర్ లో అత్యల్పంగా 51.35 శాతం నమోదైంది. ఢిల్లీలో 53.73 శాతం, బీహార్‌లో 52.24, జార్ఖండ్‌లో 61.41, ఉత్తరప్రదేశ్‌లో 52.02, ఒడిశాలో 59.60, హర్యానాలో 55.93 శాతం పోలింగ్ నమోదైనట్లు ఈసీ డాటా తెలిపింది. ఢిల్లీలోని మొత్తం 7 లోక్‌సభ నియోజకవర్గాలు, హర్యానాలోని 10, బీహార్‌లో 8, పశ్చిమబెంగాల్‌లో 8, ఒడిశాలో 6, జార్ఖండ్‌లో 4, ఉత్తరప్రదేశ్‌లోని 14 లోక్‌సభ స్థానాలకు శనివారం పోలింగ్ జరిగింది. జమ్మూకశ్మీర్‌లోని అనంతనాగ్-రాజౌరిలోనూ ఈరోజు పోలింగ్ ముగిసింది. ఆరో విడత పోలింగ్ ముగియడంతో ఇంకా మిగిలిన 57 లోక్‌సభ స్థానాలకు ఏడో విడత ఎన్నికల్లో భాగంగా జూన్ 1న పోలింగ్ జరుగుతుంది. దీంతో ఎన్నికలు పూర్తవుతాయి. జూన్ 4న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

# ఖబర్దార్ కేటీఆర్

## సామాన్యుడైన తీన్మార్ మల్లన్న పై అంత అక్కస్సు ఎందుకు?



**జమ్మికుంట మే 25 (ప్రజామంటలు):**
మొన్న డిసెంబర్ లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కేటీఆర్ కు ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టినప్పటికీ ఇంకా అహం తగ్గలేదని, వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల స్థానానికి కాంగ్రెస్ పార్టీ పక్షాన ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సామాన్యుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి అసామాన్యుడిగా ఎదిగిన తీన్మార్ మల్లన్నను చూసి ఓర్వలేక " మీకు బిట్స్ పిలానీ కావాలా.. పల్లి బఠాణి కావాలా..! అంటూ మల్లన్నను ఉద్దేశించి హేళన చేస్తూ మాట్లాడిన కేటీఆర్ ఒళ్ళు దగ్గర పెట్టుకుంటే మంచిదని తీన్మార్ మల్లన్న టీం హుజురాబాద్ నియోజకవర్గం మాజీ కో కన్వీనర్ మహమ్మద్ అంకుస్ హెచ్చరించారు. శనివారం జమ్మికుంట లో విలేకరులతో మాట్లాడుతూ అంటే సామాన్యుడు రాజకీయాలు చేయొద్దా..? మీ దృష్టిలో గవర్నమెంట్ పాఠశాలలు కళాశాలలో చదువుకున్న వారు పల్లి బఠానీలు అమ్ముకోవడానికి పనికొస్తారని మీ ఉద్దేశమా...? ప్రభుత్వ సంస్థలలో చదువుకున్నవారు పల్లి బఠానీలు అమ్ముకోవాలి, బిట్స్ పిలానీలో చదివినవారు రాజకీయాలు చేయాల అంతేనా, ఇది మీ దొర అహంకారానికి ప్రతిరూపంగా చెప్పొచ్చు. 2023 డిసెంబర్ లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పి గద్ద దింపినప్పటికీ మీ బలుపు మాత్రం అనగడం లేదు అనే విషయాన్ని మీ మాటల ద్వారా అగుపిస్తుంది. ఇప్పటికైనా ఒళ్ళు దగ్గర పెట్టుకొని ప్రజలను గౌరవించడం నేర్చుకుంటే భవిష్యత్తులో మీ పార్టీ కనీసం ప్రతిపక్ష స్థానంలోనైనా ఉంటుంది లేనట్లయితే ఇవే బలుపు మాటలు కొనసాగినట్లయితే కాలగర్భంలో కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ప్రజలారా విజ్ఞానవంతులైన పట్టభద్రులారా టిఆర్ఎస్ పార్టీ నాయకులు చేసిన దోపిడి 10 సంవత్సరాల్లో తెలంగాణను సర్వనాశనం చేసి ఇవాళ సుద్ధపూస ముచ్చట్లు చెబుతూ తెలంగాణ నష్టపోవడానికి కాంగ్రెస్ పార్టీ కారణమైనట్టుగా ప్రజలను మభ్యపెడుతూ ఇంకా ఏ ముఖం పెట్టుకొని ప్రజల్లో తిరుగుతున్నారో కేటీఆర్ ఆత్మ పరిశీలన చేసుకుంటే మంచిదని,వేయి ఎలుకలు తిన్న పిల్లి పుణ్యక్షేత్రాలు తిరిగినట్టు వేల ఎకరాలు, లక్షల కోట్ల ధనాన్ని దోచుకుని ఫామ్ హౌస్ లు కట్టుకొని,తెలంగాణను సర్వనాశనం చేసి నిరుద్యోగులను రోడ్డున పడేసి ఇవ్వాలా ఏమీ తెలియనట్టు పత్తిత్తు ముచ్చట్లు చెప్పుకుంటూ తిరుగుతున్నాడని,పట్టభద్రులారా టి ఆర్ ఎస్ నాయకులను నమ్మి మోసపోకండి. ప్రజా గొంతుకయిన తీన్మార్ మల్లన్న కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించగలరని వేడుకుంటున్నాము.

# లవ్‌మీలో దర్శకుడి తడబాటు

## సినిమా కథనంలో కానరాని వైవిధ్యం




దిల్‌రాజు కుటుంబం నుంచి వచ్చి హీరోగా తెరకు పరిచయమయ్యారు ఆశిష్. తొలి ప్రయత్నంలో 'రౌడీ బాయ్స్'తో మిశ్రమ ఫలితాన్ని అందుకున్న ఆయన.. ఇప్పుడు రెండో ప్రయత్నంలో 'లవ్ మీ'తో అలరించేందుకు సిద్ధమయ్యారు. 'బేబీ'తో మెప్పించిన వైష్ణవి చైతన్య నాయికగా నటించడం.. టీజర్, ట్రైలర్లకు ఆదరణ దక్కడం.. ప్రేక్షకుల్లో దీనిపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ర్జున్ (ఆశిష్)కు దేవుడు, దెయ్యాలపై అసలు నమ్మకం ఉండదు. ఎక్కడైనా దెయ్యాలున్నాయని తెలిస్తే చాలు అక్కడికి వెళ్లి.. అవి లేవని సాక్ష్యాధారాలతో సహా నిరూపిస్తుంటాడు. ఆ వీడియోలన్నింటినీ తన యూట్యూబ్ ఛానెల్‌లో పెట్టి డబ్బులు సంపాదిస్తుంటాడు. ఈ విషయంలో అతనికి తన సోదరుడు ప్రతాప్ (రవికృష్ణ) కూడా సహాయ పడుతుంటాడు. ఈ క్రమంలో ఓసారి అర్జున్‌కు ప్రతాప్ ప్రియురాలు ప్రియ (వైష్ణవి చైతన్య) ద్వారా దివ్యవతి అనే దెయ్యం గురించి తెలుస్తుంది. తెలంగాణ - కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న ఓ ఊరిలోని పాడుబడ్డ అపార్ట్‌మెంట్‌లో ఆ దెయ్యం తిరుగుతోందని.. ఆమె గురించి తెలుసుకోవాలని ప్రయత్నించిన చాలా మందిని హతమార్చిందని తెలుసుకుంటాడు. ఆ కథ విన్నాక అర్జున్ ఎలాగైనా ఆ దెయ్యాన్ని తన ప్రేమలో పడేయాలని నిర్ణయించుకుని అక్కడికి వెళ్తాడు. మరి ఆ తర్వాత తనెలాంటి పరిణామాల్ని ఎదుర్కొన్నాడు? దివ్యవతి కథేంటి? ఆమెకు గతంలో కనిపించకుండా పోయిన పల్లవి, నూర్, ఛరిష్మాలకు ఉన్న సంబంధం ఏంటి? అసలు దివ్యవతి కథను అర్జున్ దగ్గరకు ప్రియ ఎందుకు చేర్చింది? అన్నది సినిమా కథ.

విభిన్నమైన పాయింట్‌తో తెరకెక్కిన రొమాంటిక్ హారర్ థ్రిల్లర్. ఓ యువకుడు దెయ్యాన్ని ప్రేమలో దింపాలని ప్రయత్నిస్తే ఎలాంటి పరిణామాలెదురయ్యాయన్నది క్లుప్తంగా ఈ చిత్ర కథాంశం. ఇలాంటి కథ విషయంలో కొత్త దర్శకుడు అరుణ్ భీమవరపు అనుభవం సరిపోలేదనిపిస్తుంది. తాను రాసుకున్న కథలో కొత్తదనమున్నా.. దాన్ని లాజికల్‌గా ప్రేక్షకులు కన్విన్స్ అయ్యేలా చెప్పడంలో తడబడ్డారు. దీనికి తోడు సినిమాలో ట్విస్ట్‌లా సెట్ చేసి పెట్టుకున్న అమ్మాయిల మిస్సింగ్ పాయింట్ కథను, ప్రేక్షకుల్ని పూర్తిగా గందరగోళానికి గురి చేసింది. అర్జున్ చిన్నతనంలో తన ఊరిలో జరిగిన ఓ అసాధారణమైన మిస్టరీని చూపిస్తూ కథను ఆరంభించిన తీరు ఆసక్తిరేకెత్తిస్తుంది. ఇక ఆ తర్వాత దెయ్యాలు లేవని నిరూపించడంలో అర్జున్ శక్తిసామర్థ్యాల్ని పరిచయం చేస్తూ ఓ హారర్ ఎపిసోడ్ తెరపైకి వస్తుంది. కానీ, అదంత థ్రిల్లింగ్‌గా అనిపించదు. అర్జున్ ప్రపంచం.. ప్రతాప్‌తో కలిసి చేసే ప్రయాణం.. ప్రియ పరిచయ సన్నివేశాలు.. అన్నీ సాదాసీదాగా అనిపిస్తాయి. ప్రియ.. దివ్యవతి కథను అర్జున్‌కు పరిచయం చేసినప్పటి నుంచే అసలు కథ మొదలవుతుంది. ఆ దెయ్యాన్ని ప్రేమిస్తానంటూ అర్జున్ ఆమె అపార్టుమెంట్‌కు వెళ్లడం.. ఆరంభంలో అక్కడ తనకు ఎదురయ్యే అనుభవాలు.. అక్కడి ప్రపంచం.. అన్నీ థ్రిల్లింగ్‌గా అనిపిస్తాయి. దీనికి తగ్గట్లుగానే ద్వితీయార్ధంపై అంచనాలు పెంచేలా విరామ సన్నివేశాల్ని తీర్చిదిద్దుకున్న తీరు బాగుంది. దివ్యవతి దెయ్యం కాదు బతికే ఉందని నిరూపించడం కోసం అర్జున్ చేసే అన్వేషణతో ద్వితీయార్ధం ఆసక్తికరంగా మొదలవుతుంది. ఈ క్రమంలోనే కనిపించకుండా పోయిన ముగ్గురు అమ్మాయిల ఎపిసోడ్ తెరపైకి వస్తుంది. ఇక ప్రియ పాత్రలోని ట్విస్ట్ ఊహలకు అందేదే అయినా అర్జున్ పాత్ర వెనకున్న చిన్న మిస్టరీ కాస్త సర్‌ప్రైజ్‌కు గురి చేస్తుంది. రెండో భాగానికి లీడ్ ఇస్తూ క్లైమాక్స్‌లో సెట్ చేసిన ట్విస్ట్ థ్రిల్లింగ్‌గానే ఉంది. దర్శకుడు అరుణ్ రాసుకున్న కథలో కొత్తదనమున్నా.. దాన్ని అంతే ఆసక్తికరంగా తెరపైకి తీసుకురాలేకపో యాడు. ఫస్టాఫ్‌లో కొంత వరకు కథ అక్కడక్కడే తిరిగిన అనుభూతి కలుగుతుంది. సెకండాఫ్‌లో బాగా కంగాళిగా తయారైంది. ఎం.ఎం.కీరవాణి నేపథ్య సంగీతం సినిమాకి ఆకర్షణ. పాటలు మరీ గుర్తుంచుకునేలా లేవు. ఈ కథకు తగ్గట్లుగా పిసి శ్రీరామ్ డార్క్ టోన్డ్ సినిమాటోగ్రఫీ చక్కగా కుదిరింది. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉన్నాయి.

# జిమ్ డ్రెస్‌లో ఫోటోలు ఇష్టం ఉండదు

## మిస్టర్ అండ్ మిసెస్ మహి' ప్రమోషన్స్‌లో జాన్వీ



బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ తన తాజా సినిమా 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం మే 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈనేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో ఆసక్తికర విషయాలను పంచుకుంటున్నారు. తనకు చరిత్ర అంటే ఎంతో ఆసక్తి అని చెప్పిన జాన్వీ.. బీఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీల గురించి మాట్లాడారు. 'ఈ ఇద్దరి గురించి వినడం, మాట్లాడటం నాకెంతో ఇష్టం. వీళ్లు మన సమాజానికి ఎంతో సాయం చేశారు. ఎంతోమందిలో స్ఫూర్తి నింపారు. అందుకే ఈ ఇద్దరికీ సంబంధించిన ఏ అంశమైనా నాకు ఆసక్తిగానే ఉంటుంది. కులాలపై అంబేద్కర్ దృక్కోణం ముందునుంచీ చాలా కఠినంగానే ఉండేది. కాలక్రమేణా గాంధీ దాన్ని మారుస్తూ వచ్చారు. మన సమాజంలో కుల సమస్య అనేది ఒక్కొక్కరికీ ఒక్కోలా ఉంటుంది. కులంపై మూడో వ్యక్తి అభిప్రాయం.. ఆ జీవితాన్ని అనుభవిస్తున్న వారి అభిప్రాయానికి మధ్య చాలా తేడా ఉంటుంది' అని చెప్పారు. ఇదే ఇంటర్వ్యూలో తన ఫొటోల గురించి జాన్వీ మాట్లాడుతూ.. 'సెలబ్రిటీల తాజా ఫొటోల కోసం అభిమానులు ఎప్పుడూ ఎదురుచూస్తుంటారు. అందుకే తారలు కనిపించగానే ఫొటోగ్రాఫర్లు కెమెరాలతో క్లిక్‌మనిపిస్తుంటారు. నేను ఈ సినిమా ప్రమోషన్స్ కోసం 25సార్లు విమానంలో ప్రయాణించా.. విమానాశ్రయానికి వెళ్లేసరికే ఫొటోగ్రాఫర్లు సిద్ధంగా ఉంటారు. ఇక సినీతారల కోసం ఫొటోగ్రాఫర్లు ఎదురుచూసే మరో ప్రదేశం జిమ్. జిమ్ బయట సెలబ్రిటీలను చాలామంది ఫొటోలు తీస్తుంటారు. నన్ను అలా తీయొద్దని చాలాసార్లు అభ్యర్థించాను. ఎందుకంటే జిమ్ చేసే సమయంలో బిగుతుగా ఉండే దుస్తులు వేసుకుంటాను. ఆ దుస్తుల్లో తీసిన ఫొటోలు వైరలైతే నాకు అలాంటి డ్రెస్‌లే ఇష్టమని అందరూ భావిస్తారు. అందుకే జిమ్ బయట ఫొటోలు దిగడం నాకు నచ్చదు' అని చెప్పారు.

# బుజ్జి కారును చూసి ముచ్చటపడ్డ నాగచైతన్య





ప్రస్తుతం టాలీవుడ్‌లో ఎక్కడ చూసినా బుజ్జి టాపిక్కే నడుస్తోంది. బుజ్జి అంటే మనిషి కాదు. ప్రభాస్ హీరోగా నటిస్తోన్న కల్కి 2898 ఎడి' చిత్రంలో కీలక పాత్ర పోషించే కారు అది. ఇటీవల 'బుజ్జి'ని ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఈ చిత్రం కోసమే ప్రత్యేకంగా ఆ కారును డిజైన్ చేశారు. తాజాగా యంగ్ హీరో నాగచైతన్య బుజ్జిని కలిశారు. బుజ్జిని ప్రేక్షకులకు పరిచయం చేయడం కోసం 'కల్కి' టీమ్ ఓ ఈవెంట్ చేసింది. దానిలో బుజ్జితో పాటు ఎంట్రీ ఇచ్చాడు ప్రభాస్. ఎఫ్ 1 రేసింగ్‌లో ఉపయోగించే కారులాగా ఉన్న బుజ్జిని చూసి చాలామంది ఇంప్రెస్ అయ్యారు. అలా ఇంప్రెస్ అయినవారిలో నాగచైతన్య కూడా ఒకడు. అందుకే బుజ్జిని డైరెక్ట్‌గావెళ్లి చూశారు. బుజ్జితో ఒక రైడ్‌కు వెళ్లాడు. దాని తయారీని చూసి ఆశ్చర్యపోయాడు చైతూ. 'నేను ఇంకా షాక్‌లోనే ఉన్నాను. మీరు ఇంజనీరింగ్‌కు సంబంధించిన అన్ని రూల్స్‌ను బ్రేక్ చేశారు' అంటూ బుజ్జిని తయారు చేసిన టీమ్‌ను ప్రశంసించారు నాగచైతన్య. ఆయన బుజ్జిని కలవడం, దాంతో రైడ్‌కు వెళ్లడాన్ని వీడియోగా తీసి తమ సోషల్ మీడియాలో షేర్ చేసింది వైజయంతీ మూవీస్. మామూలుగా చైతూకు ముందు నుంచి కార్లంటే చాలా ఇష్టం. అందుకే ఏ స్టార్ దగ్గర లేని కొన్ని అడ్వాన్స్ మోడల్ కార్ కలెక్షన్స్ తన దగ్గర ఉన్నాయి.

అలాంటి హీరో బుజ్జితో రైడ్‌కు వెళ్లిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీన్నిబట్టి చూ?స్త 'కల్కి 2898'ను ప్రమోట్ చేయడానికి మరెందరో తెలుగు స్టార్లు రంగంలోకి దిగుతారని తెలుస్తోంది. ఇప్పటికే బుజ్జికి వాయిస్ ఓవర్ చెప్పడానికి కీర్తి సురేశ్ ముందుకొచ్చింది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం జూన్ 27న విడుదలకు సిద్ధమయ్యింది. ఇందులో ప్రభాస్‌కు జోడీగా దీపికా పదుకొనె, దిశా పటానీ నటించారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన కీలక పాత్రధారులు. రెండ్రోజుల క్రితం అమితాబ్ బచ్చన కూడా బుజ్జి గురించి ప్రశంసల వర్షం కురిపించారు. బుజ్జి ఓ అద్భుతం అని, రోజులు గడిచిన కొద్దీ దానిని ప్రశంసిస్తూనే ఉంటారని బిగ్‌బీ ప్రశంసించారు.

## విశ్వక్‌సేన్ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' ట్రైలర్ రిలీజ్

టాలీవుడ్ మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'గ్యాంగ్స ఆఫ్ గోదావరి'. ఈ చిత్రానికి ఛల్ మోహన్ రంగ ఫేం కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తుండగా.. డీజే టిల్లు ఫేం నేహాశెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు గ్లింప్స్ విడుదల చేయగా.. ప్రేక్షకుల వద్ద నుంచి మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఈ సినిమాను మే 31 విడుదల చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక విడుదలకు ఇంకా 5 రోజులే ఉండడంతో మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్.

# కేన్స్‌లో బాలీవుడ్ సందడి

## ఉత్తమనటిగా అనసూయ సేన్‌గుప్తాకు అవార్డు



ఫ్రాన్స్‌లో 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ అట్టహాసంగా జరుగుతోంది. ఈ వేడుకల్లో బాలీవుడ్‌కు చెందిన పలువురు స్టార్స్ సందడి చేస్తున్నారు. ప్రత్యేకంగా డిజైన్ చేసిన డ్రెస్‌లను ధరించి రెడ్ కార్పెట్‌పై యలు పోతున్నారు. మరోవైపు ఈ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో మలయాళీ చిత్రం 'ఆల్ వీ ఇమాజైన్ యాజ్ లైట్' పోటీలో నిలిచింది. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఓ భారతీయ చిత్రం కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పోటీలో నిలవడం విశేషం. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోని ముఖ్య విభాగమైన 'పామ్ డి ఓర్' అవార్డుల కేటగిరీలో ఈ సినిమా పోటీ పడుతున్నది. ఇదిలావుంటే తాజాగా భారతీయ నటి అనసూయ సేన్‌గుప్తా చరిత్ర సృష్టించింది. ఇందులో మరో ముఖ్య విభాగమైన 'అన్ స్టర్న÷యిన్ రిగార్డ్'కేటగిరీలో ఉత్తమ నటిగా అనసూయ అవార్డు అందుకుంది. 'ది షేమ్‌లెస్ అనే చిత్రానికి ఆమె ఈ అవార్డు అందుకోగా.. ఈ ప్రతిష్ఠాత్మక ఫిల్మ్‌ఫెస్టివల్‌లో అవార్డు గెలిచిన తొలి భారతీయురాలిగా అరుదైన ఘనత సాధించింది.ఇక 'ది షేమ్‌లెస్ ' చిత్ర విషయానికి వస్తే.. ఈ సినిమాను బల్గేరియన్ దర్శకుడు కాన్‌స్టాంటిన్ బొజనోవ్ దర్శకత్వం వహించాడు. ఈ చిత్రంలో అనసూయ 'రేణుక' అనే వేశ్య పాత్రను పోషించింది. దేశ రాజధాని ఢిల్లీలో గల ఓ బ్రోతల్ హౌస్‌లో ఉన్న రేణుక అనుకోకుండా అక్కడకు వచ్చిన పోలీసును చంపి పారిపోతుంది. ఇక అక్కడ నుంచి దూరంగా పారిపోయిన రేణుక ఒక సెక్స్ వర్కర్ల కమ్యూనిటీలో ఆశ్రయం పొందుతుంది. అక్కడనే ఒక అమ్మాయితో ప్రేమలో పడుతుంది. ఈ క్రమంలోనే వారికి ఎదురైన అడ్డంకులు ఏంటి. చివరికి ఎం జరిగింది అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

# ధనుష్ స్వీయ సినిమా రాయన్



తమిళ నటుడు ధనుష్ ప్రస్తుతం వరుస సినిమాలతో లైన్‌లో పెడుతున్నాడు. ఇప్పటికే ఈ ఏడాది సంక్రాంతికి 'కెప్టెన్ మిల్లర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి హిట్ అందుకున్న ఈ హీరో ప్రస్తుతం శేఖర్ కమ్ముల దర్శకత్వంలో కుబేరా అనే సినిమా చేస్తున్నాడు. ఇక ఈ సినిమా అనంతరం ధనుష్ తన 50వ సినిమాను ప్రకటించిన విషయం తెలిసిందే. ధనుష్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా పేరు రాయన్. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్‌ను విడుదల చేయగా.. మటన్ కొట్టు రాయన్‌గా ధనుష్ లుక్ వైరల్ అయ్యింది. ఇక ఇదే సినిమాలో సందీప్ కిషన్‌తో పాటు కాళిదాస్ జయరాం కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం జూన్ 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో మేకర్స్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు. ఇప్పటికే ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసిన చిత్రబృందం పీచు మిఠాయి అంటూ రొమాంటిక్ పాటను విడుదల చేసింది. ఇక ఈ పాటలో సందీప్ కిషన్, అపర్ణ బాలమురళి రోమాన్స్ ఆకట్టుకునేలా ఉంది. విజయ్ ప్రకాష్, హరిప్రియ కలిసి పాడిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం, ఎఆర్ రెహమాన్ సంగీతం అందించారు. ఈ సినిమా తమిళం, తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రంలో అపర్ణ బాలమురళి, విష్ణువిశాల్, దుషారా విజయన్, సెల్వ రాఘవన్, ఎస్‌జే సూర్య కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# జియో చేతికి భగవంత్ కేసరి హిందీవర్షన్



నందమూరి నటసింహం బాలయ్య నటించిన 'భగవంత్ కేసరి' చిత్రం గత ఏడాది దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కాజల్ కథానాయికగా నటించింది. ఈ సినిమాలో యంగ్ బ్యూటీ శ్రీలీల ముఖ్య పాత్రలో నటించింది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించాడు. ఈ మూవీలో బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ విలన్‌గా నటించాడు. ఈ మూవీని సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించగా.. ఈ మూవీ 70 కోట్లకు పైగా షేర్ ని అలాగే 132 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ రాబట్టింది. ఈ సినిమాలో తెలంగాణ యాసలో బాలయ్య చెప్పే డైలాగ్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. థియేటర్స్‌లోనే కాదు ఓటీటీలో కూడా మంచి రేటింగ్‌తో అదరగొట్టింది. తాజాగా ఈ బిగ్గెస్ట్ యాక్షన్ మూవీ హిందీ వెర్షన్ స్ట్రీమింగ్ రైట్స్‌ను జియో సినిమా సొంతం చేసుకుంది. ప్రస్తుతం హిందీ వెర్షన్ లో స్ట్రీమింగ్ అవుతోంది.

# దర్శకుడు విజయభాస్కర్ రంగప్రవేశం

## కొడుకు శ్రీకమల్ హీరోగా ఉషాపరిణయం మూవీ





టాలీవుడ్ సీనియర్ దర్శకుడు కే. విజయ్ భాస్కర్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. 'నువ్వే కావాలి', 'మన్మథుడు', 'నువ్వు నాకు నచ్చావ్', 'జై చిరంజీవ' లాంటి ఆల్‌టైమ్ ఫ్యామిలీ బ్లాక్‌బస్టర్‌లను టాలీవుడ్‌కు అందించాడు. ఇక చాలారోజులుగా సినిమాలకు దూరంగా ఉంటున్న విజయ్ భాస్కర్ తన కొడుకు కోసం మళ్ళీ మెగాఫోన్ పట్టాడు. ఆయన దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'ఉషాపరిణయం' లవ్ ఈజ్ బ్యూటిఫుల్ అనేది ఉప శీర్షిక. ఈ సినిమాలో విజయ్ భాస్కర్ కొడుకు శ్రీకమల్ హీరోగా నటిస్తున్నాడు. ఇప్పటికే మూవీకి సంబంధించి ఫస్ట్ లుక్ విడుదల చేసిన చిత్రబృందం తాజాగా టీజర్ వదిలింది. ఇక ఈ టీజర్ గమనిస్తే.. విజయ్ భాస్కర్ చాలా ఏండ్ల తర్వాత మళ్లీ ఓ సరికొత్త ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో రాబోతున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ సినిమాలో శ్రీకమల్‌తో పాటు తాన్వీ ఆకాంక్ష, సూర్య, అలీ, వెన్నెలకిషోర్, శివాజీరాజా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాలో దర్శకత్వంతో పాటు నిర్మాణ బాధ్యతల్ని కూడా విజయ్ భాస్కర్ చేపడుతున్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డిని గెలిపించాలని

**పట్టభద్రుల ఎన్నికల ప్రచారం చేసిన జడ్పిటిసి చాడ సరిత**



**వేలేర్ మే 25 (ప్రజామంటలు):**
వేలేరు మండల కేంద్రంలోని వరంగల్ - ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగ బిఆర్ఎస్ పార్టీ క్లస్టర్ ఇన్చార్జి జెడ్పిటిసి చాడ సరిత విజేందర్ రెడ్డి మరియు మండల పార్టీ అధ్యక్షులు మరిజే నర్సింగ రావు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ పంపించిన ఇన్చార్జి లతో చొప్పదండి మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సుంకె రవిశంకర్, తెలంగాణ రాష్ట్ర తొలి ఉపముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డా. తాటికొండ రాజయ్య ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి ని గెలిపించాలని, ప్రశ్నించే గొంతుకను చట్టసభకి పంపాలని ఓటర్లకు వివరిస్తూ...వేలేరు లో అదేవిధంగా 25 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లకు సంబదించినది ఇన్చార్జి లతో కలిసి బిఆర్ఎస్ అభ్యర్థికి ఓటువేయాలని ప్రచారం చేయడం జరిగింది. విజ్ఞులుగా, సమాజం పట్ల సంపూర్ణమైన అవగాహన గల పట్టభద్రులుగా. అమూల్యమైన ఓటు సీరియల్ నెంబర్ 3 పై ఏనుగుల రాకేష్ రెడ్డి కి మీ మొదటి (1) ప్రాధాన్యత ఓటు వేయండి. ౦

## టిడిపి మహానాడుకు సెలవు

**- ఎన్నికల ఫలితాల నేపథ్యంలో రద్దు**

**- కేవలం జెండా పండగలతోనే ఈయేడు సరి**

**విజయవాడ,మే25:** ఏటా మేనెల 27, 28 తేదీల్లో టిడిపిమహానాడుకు భారీగా ఏర్పాట్లు జరిగేవి. మూడ్రోజులపాటు అట్టహాసంగా మహానాడు సాగేది. దివంగత ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని మహానాడు సాగేది. ఎన్టీఆర్ ఉన్నప్పటి నుంచే ఇది మొదలయ్యింది. టిడిపి అధికారంలో ఉన్నా, లేకున్నా మహానాడులో ఎలాంటి లోటులేకుండా సాగేది. అయితే ఇప్పుడు పరిస్థితి మారింది. ఈ తేదీలకు నాలుగు రోజుల తరవాత ఎన్నికల ఫలితాలు రాబోతున్నాయి. దీంతో టిడిపి శ్రేణులంతా కౌంటింగ్ ఏర్పాట్లపై దృష్టి సారించాల్సి రావడంతో ఈ యేడు మహానాడును వాయిదా వేశారు. కేవలం గ్రామాల్లో జెండా ఆవిష్కరణలు, రక్తదానాలు వంటివి చేయాలని టిడిపి అధినాయకత్వం నిర్ణయించింది. గతేడాది తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడుకు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్ర వరం వేదకయ్యింది. ఏటా మహానాడు పర్వదినం సందర్భంగా జిల్లాలన్నీ పసుపుమయం అయ్యేవి ప్రతి ఇంటి నుంచి జనం తరలి రావాలని ఇచ్చిన పిలుపు ఇచ్చేవారు.

## రోహిణీకార్తె ప్రారంభం

**ఎండలు మండడం ఖాయం**

**హైదరాబాద్,మే25:** రోహిణి కార్తె శనివావారం మే25న ప్రారంభమైంది. దీని ప్రభావం శుక్రవారం నుంచే మొదలయ్యింది. జూన్ 8 వరకూ ఉంటుంది. దాదాపు 15 రోజుల పాటూ ఎండలు మండి పోనున్నాయి. నాలుగు నెలల ఎండాకాలంలో ఎండలు తొలి రోజుల్లో కొద్దికొద్దిగా పెరిగి ఉగాది నుండివేసవితాపం పెరుగుతుంది. దిన దిన ప్రవర్ధనమానంగా సూర్య భగవానుడు తన ప్రతాపాన్ని చూపిస్తాడు. రోహిణి కార్తె 15 రోజుల్లో సూర్యుడి తీవ్రత తారాస్థాయికి చేరి ఆ తర్వాత నుంచి మళ్లీ నెమ్మదిగా తగ్గుతూ ఉంటుంది. రోహిణి తరవాత మృగశర కార్తె ఆరంభం అవు తుంది. వర్షాలు పడడంతో అప్పుడు వాతావరణం చల్లబడుతుంది. 27 నక్షత్రాలు, గ్రహాల ఆధారంగా పంచాంగాలు తయారు చేశారు. జాతకాలు నిర్ణయిస్తారు. సూర్యోదయం సమయానికి ఏ నక్షత్రం చంద్రుడికి దగ్గరగా ఉంటే ఆ రోజుకు ఆ నక్షత్రం పేరు పెట్టారు. పౌర్ణమి రోజు చంద్రుడు ఏ నక్షత్రానికి దగ్గరగా ఉంటే ఆ నెలకు ఆ పేరు పెట్టారు. కానీ తెలుగు రైతులు మాత్రం ఇవే నక్షత్రాలతో వ్యవసాయ పంచాంగం తయారు చేసుకున్నారు. ఈ నక్షత్రాలను కార్తెలు అని పిలుచుకుంటు న్నారు. రైతుల లెక్కల ప్రకారం సూర్యుడు ఏ నక్షత్రానికి దగ్గరగా ఉంటే ఆ కాలానికి ఆ కార్తె పేరు పెట్టారు. అలా సంవత్సరానికి 27 కార్తెలు. తెలుగు రైతులంతా తమ అనుభవం నుంచి సంపాదించుకున్న వ్యవసాయ విజ్ఞానాన్ని కార్తెలుగా వాటిని అందరకీ అర్థమయ్యేలా సామెతల రూపంలో అందరకీ అర్థమయ్యేలా చెప్పారు. అందులో ఒకటి రోహిణి కార్తె. రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలు అని నిర్ధారించారు. మాములుగా ఉండే ఎండల వేడినే తట్టుకోలేమంటే ఎండాకాలంలో చివరి కార్తె అయిన రోహిణిలో ఎండలు దంచికొడతాయి.

## కొనసాగుతున్న భగవద్గీత శిక్షణ తరగతులు




**జగిత్యాల మే 25 (ప్రజా మంటలు)**
జిల్లా కేంద్రంలోని శ్రీ అయ్యప్ప దేవాలయంలోగత 3రోజుల క్రితం ప్రారంభమైన భగవద్గీత శిక్షణ తరగతుల లో భాగంగా శనివారం, గీతా సంగ్రహం చదవడం వల్ల పూర్తి భగవద్గీత పఠనం చేసిన ఫలితం దక్కుతుందని శ్రీ కృష్ణుడు చెప్పిన విషయాలను శిక్షనని చ్చే గురువులు తెలిపారు. ఈనాటి కార్యక్రమంలో పాంపట్టి రవీందర్, గుడి కందుల వెంకన్న,కోటగిరి కళ, జిడిగే రాము, బండారి లక్ష్మి నారయణ, దశరథ రెడ్డీ, మార కైలాసం, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ, బిఆర్ఎస్ పార్టీ లు చేస్తున్న తప్పుడు ప్రచారానికి మోసపోవద్దు

## ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వేలేరు మే 26 (ప్రజామంటలు):** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే కడియం శ్రీహరి కామెంట్స్:**
పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గారిని మొదటి ప్రాధాన్యత ఓటు తో గెలిపించాలి. తీన్మార్ మల్లన్న గెలుపు ద్వారా పట్టభద్రుల సమస్యలు, నిరుద్యోగుల ఉపాధి అవకాశాలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాడు. త్వరలోనే జాబ్ క్యాలెండర్ ను సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించానున్నారు. బీజేపీ, బిఆర్ఎస్ పార్టీ లు చేస్తున్న తప్పుడు ప్రచారానికి మోసపోవద్దు. పట్టభద్రులు వివేకంతో అలోచించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలి. కేంద్రంలో 10 ఏళ్ళు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం యువతకు చేసింది ఏమి లేదు. ఉపాధి అవకాశాలు కల్పించలేదు, ఉద్యోగాలు భర్తీ చేయలేదు. నరేంద్ర మోడీ ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పాడు 10 ఏళ్ళు అధికారంలో ఉండి 20 లక్షల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదు. నరేంద్ర మోడీ ప్రభుత్వం, బీజేపీ పార్టీ యువతను మోసం చేసింది, దగా చేసింది.తెలంగాణ విభజన చట్టంలోని హామీలలో ఏ ఒక్కటీ అమలు చేయలేదు.

**ఎందుకు బీజేపీకి, నరేంద్ర మోడీకి తెలంగాణపై వివక్ష.**
తెలంగాణలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయలేదు, స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయలేదు. ఒక్క విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయలేదు. ఒక్క ప్రాజెక్ట్ ఇవ్వలేదు. ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వలేదు. నిధులు ఇవ్వడం లేదు....? తెలంగాణ బీజేపీ నాయకులు ఏమి చేస్తున్నారు. గత 5 ఏళు ్లగా కిషన్ రెడ్డి మంత్రివర్గంలో ఉండి ఏం చేశాడు. మీకు వచ్చిన అవకాశాలతో తెలంగాణకు ఒరిగింది ఏంటీ....? కిషన్ రెడ్డి దీనికి సమాధానం చెప్పాలి. తెలంగాణ అభివృద్ధిలో మీ ప్రాతినిధ్యం ఏమి లేదు. అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లే ఇస్తున్నారు తప్ప. ప్రత్యేకంగా ఎం చేశారు. తెలంగాణ అభివృద్ధికి ఏ మాత్రం సహకరించని బీజేపీకి తెలంగాణ ప్రజలు ఎందుకు ఓటు వేయాలి తెలంగాణ యువత బీజేపీని నిలదీయాలి. కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించే నైతిక అర్హత బీజేపీకి లేదు. గత ప్రభుత్వం చేసిన అవినీతి, అక్రమాలపైన ఎందుకు విచారణ చేయడం లేదు. బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలు లోపయాకరి ఒప్పందాలు చేసుకున్నారు. ఎంపీ ఎన్నికలలో బీజేపీకి బిఆర్ఎస్ సపోర్ట్ చేసింది. కేసీఆర్ కూతురు కవిత కు బెయిల్ ఇప్పించాలని, గత ప్రభుత్వ అవినీతి పై విచారణ జరగద్దని ఒప్పందం చేసుకున్నారు. బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తె చెత్త బుట్టలో వేసినట్లే.

**బిఆర్ఎస్ గెలిచేది లేదు... గెలిచినా చేసేది ఏం లేదు**
పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత బిఆర్ఎస్ పార్టీ ఉంటుందో, ఉండదో! బిఆర్ఎస్ కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరు చెప్పుకొని రాజకీయాలు చేసింది.మ్ఇప్పుడు ఆ కాళేశ్వరం ప్రాజెక్టే బిఆర్ఎస్ ను ముంచుతుంది. నేనే కుర్చీ వేసుకోని కట్టాను అని చెప్పిన వ్యక్తి ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదు. బిఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై పట్టభద్రులు ఒక్కసారి అలోచించాలి.కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ను మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలి.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పత్తికి మొగ్గుచూపుతున్న రైతులు

## నకిలీ విత్తనాలపై కన్నేసిన అధికారులు



**ఆదిలాబాద్,మే25** ఊహించినట్టుగానే ఈ ఏడాది కూడా జిల్లాలో పత్తి పంటే అధిక విస్తీర్ణంలో సాగు చేయవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వరికి నీటి తడులు ఎకకువగా అవసరంతో పాటు, ఖర్చుకూడా తడిసి మోపెడు అవుతోంది. కూలీల సమస్య కూడా ఉంటోంది. దీనికితోడు పత్తి తప్ప ఏ పంట వేసినా కోతుల బెడద కూడా దెబ్బతీస్తోంది. ఈ క్రమంలో రైతులు వరికన్నా పత్తి మేలని భావిస్తున్నారు.మరోవైపు రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ పత్తి విత్తన కంపెనీలు ఏటా ముంచుతున్నాయి. అయితే ఈయేడు ఇప్పటినుంచే దాడులు చేసి పట్టుకుంటున్నారు. రైతులు విత్తన కొనుగోళ్లో జాగ్రత్తగా ఉండేలా హెచ్చరికలు చేస్తున్నారు. పత్తికి తోడు కంది, వరి, జొన్న, పెసర, మినుములు వంటి ఇతర పంటలను కూడా సాగు చేయవచ్చని అధికారులు సూచనలు వేశారు. ఇవి కాకుండా పోషకాహార పంటలైన చిరుధాన్యాల పంటలను సాగు చేసేందుకు ప్రత్యేకంగా చర్య లు చేపడుతున్నారు. ఇందుకు గాను వందశాతం సబ్సిడీపై రైతులకు చిరుధాన్యం విత్తనాలను పంపిణీ చేయనున్నారు. ఇవి కాకుండా ఉద్యానవనశాఖ ద్వారా వివిధ రకాల కూరగాయాల పంటలు సాగు అయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ముఖ్యంగా కాగజ్ నగర్, ఆసిఫాబాద్ పట్టణాలకు సమీపంలో ఉండే మండలాల్లో కూర గాయాల సాగును ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. జిల్లాలో పత్తి సాగుకు సంబంధించి యేటా అంచనాలకు మించి ఉంటున్న నేపథ్యంలో సీజన్ ప్రారంభమైన తర్వాత సాగు విస్తీర్ణం కాస్తా అటు ఇటుగా మారే అవకాశాలున్నాయని చెబుతున్నారు. దుక్కులు చేస్తూ తొలకరి వర్షానికే విత్తనాలు పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మెట్ట పంటలను పక్కన పెడితే వరి సాగులో జీలుగ పంటను నాటి రసాయన ఎరువుగా రైతాంగం ఉపయోగిస్తున్నది.

## పదేళ్లలో బిఆర్ఎస్ ఉద్యోగాలు ఇవ్వలేదు

**ఇస్తే నిరుద్యోగులు ఎందుకు ప్రశ్నిస్తారు**

**ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారంలో ఈటెల విమర్శలు**

**ఖమ్మం,మే25:** పదేళ్లలో భారాస ఉద్యోగాలు కల్పించలేకపోయిందని భాజపా నేత ఈటల రాజేందర్ విమర్శించారు. అలా కల్పించివుంటే ఇవాళ నిరుద్యోగులు ఎందుకు ప్రశ్నిస్తారని అన్నారు. ఉద్యోగాలు కల్పించక పోగా ..ఇచ్చామని చెప్పడం మరింత దారుణమని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇల్లందులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడే ఏమీ చేయని భారాస ఇప్పుడెలా చేస్తుందని ప్రశ్నించారు. నీళ్లు, నిధులు, నియామకాలు పక్కదారి పట్టాయన్నారు. కాంగ్రెస్ డిక్లరేషన్లు, సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం మాత్రమే అమలవుతోందని చెప్పారు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను మంత్రిగా ఉన్నప్పుడే మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు. పట్టభద్రులను చిన్నచూపు చూసిన పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఉద్యోగాల నోటిఫికేషన్లు రావడం లేదని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఈటల రాజేందర్ అన్నారు.

## విజయవాడను ముంచెత్తిన భారీ వర్షం

**జలమయమైన నగర రహదారులు**

**విజయవాడ,మే25:** విజయవాడలో పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం నుంచి వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయమై.. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బెంజి సర్కిల్, మొఘల్రాజపురం, ఏలూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాల్లోకి వరద చేరింది. మరోవైపు అనంతపురం జిల్లా ఉరవకొండ, విడపనకల్లు మండలాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. బూదగవి చెరువు అలుగు పారుతోంది. విడపనకల్లు మండలంలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు కూలాయి. దీంతో 19 గ్రామాలకు రాత్రి నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పెంచులపాడు-పొలికి, పాల్తూరు-గోవిందవాడ గ్రామాల మధ్య వాహన రాకపోకలు నిలిచిపోయాయి. పొలాల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి.

# వానాకాలం సాగుకు సన్నద్ధం

**- ముందస్తు రుతపవనాల రాకతో అప్రమత్తం - వరితో పాటు ఆరుతడి పంటలకు ప్రోత్సాహం**

**నిజామాబాద్,మే25:** జిల్లాలో వానాకాలం పంటల సాగుకు వ్యవసాయాశాఖ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఈ యేడాది రుతుపవనాలు జూన్ మొదటి వారంలోనే వచ్చే అవకాశం ఉంటుందన్న వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో జిల్లా వ్యవసాయాధికారులు పంటల సాగు ప్రణాళిక సిద్ధం చేసేపనిలో ఉన్నారు. రైతుల సాగుకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో వరిసాగు ఎక్కువగా ఉన్నందు వల్ల ఈ పంటను అత్యాధునిక పరిజ్ఞానంతో పండించే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఖర్చు తగ్గించి ఎక్కువ దిగుబడి వచ్చే పద్ధతులను రైతులకు వివరిస్తున్నామని తెలిపారు. జిల్లాలో వరితో పాటు ఆరుతడి పంటలను కూడా ఎక్కువమొత్తంలో సాగయ్యే విధంగా రైతులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. వానాకాలంలో రైతులకు పంటలపై అవగాహన కల్పించడంతో పాటు ఆరుతడి పంటలను ప్రోత్సహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పంటల కాలనీ ఏర్పాటులో భాగంగా వరి సాగులో అత్యాధునిక పద్ధతులను రైతులు అవలంబించేవిదంగా ప్రయత్నాలు చేస్తున్నారు. వరిలో విత్తనాలు వెదజల్లే పద్ధతిని ప్రొత్సహించేందుకు సిద్ధమవుతున్నారు. వానకాలం సీజన్‌లో సరిపడా విత్తనాలు, ఎరువులను సమకూరు స్తునే సీజన్ ప్రారంభానికి ముందే అన్ని క్లస్టర్‌ల పరిధిలో రైతులకు అత్యాధునిక పద్ధతులను వివరించేం దుకు ఏర్పాట్లను చేస్తున్నారు. విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా కొన్ని రకాల విత్తనాలు సరఫరా చేస్తున్నామని, ఇతర విత్తనాలను ప్రైవేట్ విత్తన సంస్థల ద్వారా కొనుగోలు చేసుకోవాలన్నారు. వానకాలం సీజన్‌లో ఏ పంటలు ఎక్కువగా పెరగనున్నాయో యాక్షన్ ప్లాన్‌లో పొందుపర్చారు. ప్రభుత్వం ఆదేశాల ప్రకారం రైతులకు ఆరుతడి పంటల సాగును వివరించడంతో పాటు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పంటలకు



అనుగుణంగా విత్తనాలను సమకూర్చాలని ప్రభుత్వానికి పంపిన ప్రణాళికల్లో పేర్కొన్నారు. జిల్లాలో పత్తి సాగును కొత్తగా మొదలుపెడుతున్నందు వల్ల అవసరమైన విత్తనాలను ప్రణాళికలో పొందుపర్చారు. వెదజల్లే పద్ధతికి ప్రోత్సాహం జిల్లాలో వచ్చే వానాకాలం సాగు కోసం వరిలో వెదజల్లే పద్ధతిని ప్రోత్సహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. వ్యవసాయంలో ఖర్చు తగ్గించడంతో పాటు దిగుబడి పెంచడంలో భాగంగా ఈ పద్ధతిని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com